సాక్షి
ఖమ్మం
మంగళవారం । 19 । మార్చి । 2024



ఆస్పత్రుల్లో తనిఖీ

ఖమ్మంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ చేసిన ఉన్నతాధికారుల బృందం.. నిబంధనలు పాటించని రెండింటిని సీజ్ చేసిందిి.

8లో



'అమ్మ' చల్లని చూపులో..


ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించిన సర్కార్.. స్కూళ్ల నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది.

8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 22°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై క్రమక్రమంగా పెరుగుతుంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.25
సహర్ (బుధవారం ఉ॥) 4.53

మాకేవి పదవులు?!



కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు దక్కని వారిలో నైరాశ్యం నెలకొంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందురోజు రాష్ట్రవ్యాప్తంగా 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా.. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం దక్కింది. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, రాయల నాగేశ్వరరావు గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే వైరాకు చెందిన హైదరాబాద్‌లో నివాసముంటున్న మరో ఇద్దరికీ పదవులు దక్కాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా.. రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో అసంతృప్తి బయటపడుతోంది. మొదటి నుంచీ రేసులో ఉన్న తమకు తొలి జాబితాలో స్థానం దక్కలేదని నేతల వద్ద వాపోతుండగా.. లోక్‌సభ ఎన్నికల తర్వాత పదవులు వస్తాయని వారు బుజ్జగిస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు ఎక్కువ మంది పదవులు ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

'నామినేటెడ్'పై ఆశావహుల్లో నైరాశ్యం

- ఉమ్మడి జిల్లా కోటాలో తాజాగా ముగ్గురికి పదవులు
- రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులకు పలువురి నిరీక్షణ
- రేసులో ముగ్గురు మంత్రుల అనుచరులు
- మిగతావి ఎన్నికల తర్వాతేనని నేతల బుజ్జగింపులు

పొంగులేటి శిబిరంలో ఎక్కువ..

మంత్రి పొంగులేటి అనుచరుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఆశించారు. గతంలో మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్‌గా బొర్రా రాజశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పిడమర్తి రవి బాధ్యతలు నిర్వర్తించగా.. ఇప్పటివరకైతే వీరికి చోటు దక్కలేదు. అలాగే ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, జూపల్లి రమేష్, డాక్టర్ కోటా రాంబాబు, మద్దినేని బేబీ స్వర్ణకుమారి సైతం జాబితాలో ఉన్నారు. ఇంకా ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల కోసం నేతలు పోటీ పడుతున్నారు. పొంగులేటి కోటాలో ఇప్పటికి మువ్వా విజయ్‌బాబుకు పదవి దక్కగా.. పాలేరు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడిన రాయల నాగేశ్వరరావుకు పార్టీ కోటాలో పదవి వచ్చిందని నేతలు చర్చించుకుంటున్నారు.

భట్టి అనుచరుల్లో ఒకరికి..

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కోటాలో వైరా వాసి, హైదరాబాద్‌లో నివాసముంటున్న నాయుడు సత్యంకు రాష్ట్ర హస్తకళల చైర్మన్ పదవి దక్కింది. అయితే, భట్టి అనుచరులైన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి జిల్లాకు చెందిన నాగా సీతారాములుతో పాటు మరికొందరు నేతలు పదవులపై ఆశ పెట్టుకున్నారు. ఒకరికి రాష్ట్ర స్థాయి పదవి రావడంతో మిగిలిన వారెవరికైనా రాష్ట్ర స్థాయి పదవులు దక్కుతాయా.. లేక జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులతో సరిపెడతారా అన్న చర్చ జరుగుతోంది.

తుమ్మల అనుచరుల ఎదురుచూపు..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులైన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళి, చావా నారాయణ, నల్లమల వెంకటేశ్వరరావు, శెట్టి రంగారావు తదితరులు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఆశించారు. ఇప్పటి వరకు పొంగులేటి, భట్టి కోటాలో కొందరికి నామినేటెడ్ పదవులు దక్కగా, మలి విడతలో తమలో ఒకరికైనా అవకాశం దక్కుతుందనే ఆశతో వారు ఉన్నట్లు తెలుస్తోంది.

మీకు తప్పనిసరి!

ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది కాంగ్రెస్ దక్కించుకోగా పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానం సీపీఐ ఖాతాలో చేరింది. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ గెలవడంతో రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లోనూ ఇక్కడి నేతలకు ప్రాధాన్యత ఇస్తారని ఆశావహుల్లో ధీమా వ్యక్తమైంది. రాష్ట్రంలోని 70 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాల్సి ఉండగా, ఇంకా 25 కార్పొరేషన్లు మిగిలాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి మరో ఇద్దరికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. లేనిపక్షంలో జిల్లా స్థాయి పదవులైనా ఇప్పిస్తామని ఆశావహులను నేతలు బుజ్జగిస్తున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణలు, పార్టీకి విధేయతను కూడా పరిగణనలోకి తీసుకొని పదవులు భర్తీ చేయాలని ఆశావహుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పది పరీక్షలు ప్రారంభం



ఖమ్మంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



(ఇన్‌సెట్) సెట్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న పరిశీలకుడు మదన్‌మోహన్, పక్కన డీఈఓ శర్మ

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్
- ఏదులాపురంలో విధుల నుంచి ఇన్విజిలేటర్ తొలగింపు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 97 కేంద్రాల్లో తొలిరోజు 16,640మందికి 16,589 మంది విద్యార్థులు హాజరుకాగా, 51మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9–30గంటలకు మొదలయ్యే పరీక్షకు 8–30నుంచే అనుమతిస్తామని చెప్పడంతో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. ఎస్సెస్సీ పరీక్షల ఉమ్మడి జిల్లా పరిశీలకుడు మదన్మోహన్ జిల్లాలోని ఐదు కేంద్రాల్లో తనిఖీ చేయడమే కాక డీఈఓ కార్యాలయం నుంచి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. అలాగే, అదనపు కలెక్టర్, డీఈఓ, అసిస్టెంట్ కమిషనర్ మరికొన్ని కేంద్రాలను పరిశీలించారు. కాగా, ఏదులాపురం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఓ ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు.

వసతులు కల్పించాలి..

ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం, తాగునీరు, ఇతర వసతులపై ఆరా తీసిన ఆయన ఎండల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల రవాణాలో జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థులతో పాటు, సిబ్బందిని తనిఖీ చేశాకే అనుమతించాలని తెలిపారు. కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహారావు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



హాల్‌టికెట్‌కు పూజ చేయించుకుంటున్న విద్యార్థి

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన డీఎంహెచ్ఓ

ఖమ్మం వైద్యవిభాగం: వ్యక్తిగత కారణాలతో కొంతకాలంగా సెలవులో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి తిరిగి విధుల్లో చేరారు. ఆమె స్థానంలో ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓగా సుబ్బారావుకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే, మాలతి సోమవారం రిపోర్ట్ చేయటంతో సుబ్బారావు జిల్లా క్షయనివారణ అధికారిగా కొనసాగనున్నారు.

నేడు 'రైతు నేస్తం'

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతునేస్తం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. జిల్లాలోని ఐదు రైతు వేదికల్లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వివిధ పంటల సాగులో మెళకువలను జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాస్, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త, డీన్ డాక్టర్ రాజశేఖర్, శాస్త్రవేత్త డాక్టర్ కె.కవిత రైతుల వివరిస్తారని తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ సూచించారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. ఆతర్వాత కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భక్తులకు ఇబ్బంది రానివ్వొద్దు

- లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- శ్రీరామనవమి సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలంలో వచ్చే నెల జరిగే శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. భద్రాద్రి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ కల్యాణవేడుక నిర్వహించే మిథిలా స్టేడియాన్ని 26 సెక్టార్లుగా విభజించి, ప్రతీ సెక్టార్లలో కూర్చునే భక్తులు వేడుకను వీక్షించేలా చూడాలని తెలిపారు. వసతిగృహాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం ఉన్న అంశంపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఉత్సవాల రోజుల్లో భద్రాచలం పట్టణంలో మద్యం, మాంసం విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది నియామకం, తాగునీటి సరఫరా, గోదావరిలో బారికేడ్ల ఏర్పాటుపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతీక్‌జైన్, ఆలయ ఈఓ రమాదేవి, డీఆర్ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓ మధు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్‌కు ప్రతిపాదనలు

- ఇటీవలే ప్రకటించిన మంత్రి తుమ్మల
- రంగంలోకి దిగిన మార్కెటింగ్ శాఖ



ఖమ్మం మార్కెట్ ముఖద్వారం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను అత్యాధునిక వసతులతో మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. ఇందుకోసం రూ.100 కోట్లు కేటాయిస్తామని కూడా తెలిపారు. ఈ నేపథ్యాన మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల బృందం మార్కెట్‌ను సోమవారం పరిశీలించింది. రాష్ట్రంలో పెద్దదైన ఖమ్మం మార్కెట్ మిర్చి క్రయవిక్రయాలకు పేరుగాంచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ మంత్రి పదవి దక్కడంతో ఇక్కడి మార్కెట్ అభివృద్ధిపై దృష్టి సారించారు. ఈక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఏడీ పి.రవికుమార్, జేడీ వి.శ్రీనివాస్, వరంగల్ రీజియన్ జేడీ ఈ.మల్లేశం, డీడీ ఏ.రాజు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ బీఆర్‌కే.మూర్తి, అధికారులు కరుణాకర్‌రెడ్డి, సుబ్బారావు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పరిశీలించారు. అందుబాటులో ఉన్న 15 ఎకరాల విస్తీర్ణంలో నూతన నిర్మాణాలు, అడ్తీదారులకు దుకాణ సముదాయం నిర్మాణాలపై చర్చించడమే కాక వర్షంలోనూ క్రయవిక్రయాలు కొనసాగేలా షెడ్ల నిర్మాణ డిజైన్లను పరిశీలించినట్లు తెలిసింది. మార్కెటింగ్ శాఖ రూపొందించిన రెండు డిజైన్ల ఆధారంగా అధ్యయనం చేస్తూనే మార్పులు, చేర్పుల దిశగా చర్చించినట్లు సమాచారం.

శిక్షణ కేంద్రం పోయినట్లే?

- స్థలం లేక డ్రైవింగ్ కేంద్రం వెనక్కి...
- మూడున్నరేళ్ల క్రితం మంజూరు
- ఎవరికీ పట్టింపు లేక ఏర్పాటులో జాప్యం



ఖమ్మంక్రైం: గత ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఐటీడీఆర్) వెనక్కి మళ్లినట్లు తెలిసింది. రాష్ట్రంలోని సిరిసిల్లలో తొలిసారి ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేయగా, అంతకంటే మెరుగైన వసతులతో ఖమ్మంకు రెండోది కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వాసుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ ఇక్కడ సెంటర్‌కు సరిపడా స్థలాన్ని కేటాయించడంలో ఆలస్యం చేయగా... ప్రభుత్వం రద్దు చేసినట్లు సమాచారం.

ఏమిటీ సెంటర్...

ప్రైవేట్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలపై నియంత్రణ లేకపోగా ఫీజులు ఇష్టానుసారం వసూలు చేయడంతో మెళకువలు నేర్పకుండానే మమ అనిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా శిక్షణ పొందినట్లు భావిస్తున్న వారి కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే భావనతో అప్పటి ప్రభుత్వం వాహనదారులకు మెరుగైన శిక్షణ అందించేందుకు జాతీయ రహదారుల సంస్థ అనుమతితో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ కేంద్రంలో అత్యాధునిక వసతులతో తర్ఫీదు ఇవ్వడమే కాక వర్క్‌షాప్ కూడా ఏర్పాటు చేస్తారు.

ఐటీఐ తరహాలో శిక్షణ

ఇక్కడ కూడా డ్రైవింగ్‌లో మెళవకులు నేర్పించడమే కాక వాహనాలు మధ్యలో ఆగిపోతే చిన్నపాటి మరమ్మతులు చేసుకునేలా వర్క్‌షాప్‌లో శిక్షణ ఇప్పిస్తారు. నిపుణుల పర్యవేక్షణలో వాహనాలను నడపడంలో మెళకువలు నేర్పించడం ద్వారా డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటిస్తారని, తద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయనేది ప్రభుత్వ భావన. అత్యాధునిక వసతులతో ఈ కేంద్రం ఏర్పాటుచేయాల్సి ఉండగా... ట్రాఫిక్ నిబంధనలపై కూడా అవగాహన కల్పించి, డ్రైవింగ్ లైసెన్స్ కూడా జారీ చేస్తారు.

స్థలం ఎంపికలో తీవ్ర జాప్యం

డ్రైవింగ్ అండ్ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటుకు 10నుంచి 15ఎకరాల స్థలం అవసరమవుతుంది. సిరిసిల్లతో పోలిస్తే మరింత మెరుగైన వసతులతో నిర్మించేందుకు రూ.20కోట్ల వ్యయమవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ సెంటర్ మంజూరై మూడేళ్లు దాటినా స్థలం ఖరారు చేయడంలో జిల్లా యంత్రాంగం జాప్యం చేసింది. ఈలోపు ప్రభుత్వం మారగా.. కేంద్రాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యాన కేంద్రాన్ని తిరిగి మంజూరు చేసి త్వరగా ఏర్పాటయ్యేలా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఈ విషయమై శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జిల్లా అధికారులు చెబుతున్నారు.

నిఘా బృందాలే కీలకం..

- ఎన్నికల వేళ సమర్థవంతంగా పనిచేయాలి
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్




ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: స్వేచ్ఛాయుత వాతావరణంలో అక్రమాలకు తావు లేకుండా ఎన్నికలు జరగడంలో నిఘా బృందాల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ బృందాలకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 15 ఎస్ఎస్‌టీ, 12 ఎఫ్ఎస్‌టీ, 27 ఎంసీసీ బృందాలు ఏర్పాటు చేయగా.. రాజకీయ నాయకులు, పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల తొలగింపుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటుచేసి ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. జప్తులు సంఖ్య ఆధారంగా కాకుండా సమర్థవంతంగా జరగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సమాచార సేకరణలో కీలకంగా వ్యవహరిస్తూనే ప్రజల్లో సీ–విజిల్ యాప్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇక సభలు, సమావేశాల నిర్వహణ కోసం 'సువిధ' ద్వారా దరఖాస్తు చేసుకునేలా పార్టీల నాయకులకు అవగాహన కల్పించి.. క్రమసంఖ్య ఆధారంగా అనుమతులు జారీ చేయాలని సూచించారు. అనంతరం స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె.శ్రీరామ్ విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు ప్రారంభం

క్షేత్రస్థాయిలో నిఘా కోసం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు వాహనాలను కేటాయించారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు మూడు చొప్పున, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గానికి రెండేసి చొప్పున కేటాయించిన వాహనాలను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సోమవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. కాగా, అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను తనిఖీ చేసి న ఆయన రాజకీయ నాయకులు, పార్టీల క్యాలెండర్లు, పోస్టర్లు, ఫొటోలు తొలగించారా, లేదా అని పరిశీలించాక ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, డీఆర్ఓ ఎం.రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ వినోద్, సీపీఓ శ్రీనివాస్, ఎంవీఐ వెంకటరమణ, ఏపీఆర్వో వల్లోజి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు రాళ్లబండి రాంబాబు, మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.10కోట్లు




పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాల్వంచ: కేంద్రప్రభుత్వం బాలికల అభివృద్ధికి నిర్దేశించిన ప్రధానమంత్రి రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్ష అభియాన్ పథకం కింద పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.10కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 13 కళాశాలలు ఎంపిక కాగా, ఇందులో పాల్వంచ కూడా ఉందని వెల్లడించారు. ఈ నిధులతో అత్యాధునిక వసతులతో బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కళాశాల 2024–25 విద్యాసంవత్సరం నుండి అటానమస్ హోదా కలిగి ఉండడంతో పాటు నాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన నేపథ్యాన నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



చెక్‌పోస్టులో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



ఎస్సైకి సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం సహకారనగర్: చెక్‌పోస్టుల వద్ద అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మంలోని కాల్వొడ్డు, నయాబజార్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులను సోమవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తూ నగదు, మద్యం రవాణాను నియంత్రించాని, ప్రతీ తనిఖీని వీడియోలో చిత్రీకరించాలని సూచించారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టులు..

ముదిగొండ: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. జిల్లాలో పది చోట్ల అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఎనిమిది అంతర్ జిల్లా చెక్‌పోస్టులతో పాటు ఇతర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని.. అక్కడ 24గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ముదిగొండ మండలం వల్లభిలో ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సోమవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక పోలీసుల ద్వారా నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించే ప్రతీ మార్గంలో వాహనాల తనిఖీలు ఉంటాయని, ఎన్నికలకు నిబంధనలకు మేరకు రూ.50వేలకు మించి నగదుతో పాటు పెద్దమొత్తంలో ఆభరణాలు తీసుకెళ్లే వాహనదారులు తగిన ఆధారాలు సమర్పించాలని సూచించారు. లేనిపక్షంలో సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తామని సీపీ తెలిపారు. ముదిగొండ ఎస్ఐ గజ్జెల నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్



వాహన తనిఖీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

తిరుమలాయపాలెం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం సమీపాన ఏర్పాటుచేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సోమవారం తనిఖీ చేశారు. మద్యం, నగదు జరగకుండా అన్ని వాహనాలను తనిఖీ చేయాలని ఉద్యోగులకు సూచించారు. అతర్వాత హస్నాబాద్, బచ్చోడు, పిండిప్రోలు పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, సూపర్‌వైజర్లు వీరయ్య, లక్ష్మణ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దని నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న స్థానికులు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా పరిధి టెంపుల్‌సిటీ కాలనీలో ఓ ఇంటిపై ప్రైవేట్ సెల్ కంపెనీ టవర్ ఏర్పాటుచేస్తుండగా కాలనీవాసులు సోమవారం అడ్డుకున్నారు. కాలనీలోని మహిళలు, చిన్నారులు ప్లకార్డులు చేబూని నిర్మించొద్దని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానికుల అభిప్రాయానికి టవర్ వ్యతిరేకంగా ఏర్పాటుచేయడం సరికాదన్నారు. సమీపంలో హెచ్‌టీ విద్యుత్ లైన్ కూడా ఉన్నందున తాము అనారోగ్యం బారిన పడతామని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి ఉషూ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: సబ్ జూనియర్ విభాగంలో జాతీయస్థాయి ఉషూ పోటీలకు జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లోని జమ్మూ యూనివర్సిటీలో పోటీలు జరగనుండగా రాష్ట్ర జట్టులో నలుగురికి స్థానం దక్కింది. ఈమేరకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన టి.భవ్య, వై.రుత్విక్, సుశాంత్, జి.సాత్విక్‌ను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీటీ ఉపేందర్, కోచ్ పి.పరిపూర్ణచారి అభినందించారు.

ఇసుక లారీలు సీజ్

కామేపల్లి: పరిమితికి మించి ఇసుక తరలిస్తున్న మూడు లారీలను కామేపల్లి పోలీసులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. తనిఖీల్లో భాగంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్నట్లు తేలడంతో సీజ్ చేసి సోమవారం మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడిపై కేసు

నేలకొండపల్లి: మైనర్ బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గువ్వలగూడెంకు చెందిన యువకుడు ముదిగొండ మండలంలోని కమలాపురానికి చెందిన బాలికను గతనెల వివాహం చేసుకున్నాడు. ఈవిషయమై అందిన సమాచారంతో తిరుమలాయపాలెం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఇతర శాఖల అధికారులు సోమవారం గువ్వలగూడెంలో విచారించారు. సదరు యువకుడు బాలికను వివాహం చేసుకున్న విషయం నిజమేనని తేలడంతో సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్న ఓ యువకుడిపై సోమవారం పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక(17)ను అదే ప్రాంతానికి చెందిన యువకుడు ఏడాది కాలంగా తాను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి కూడా సదరు మైనర్ బాలిక ఇంటికి వెళ్లి వేధించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	20,200	12,000
మిర్చి తాలు	11,000	7,500
కందులు	9,250	8,900
పెసలు	8,100	6,900
పత్తి	7,580	5,000
అలసంద	7,411	7,350

– ఖమ్మం వ్యవసాయం

'అమ్మ' చల్లని చూపులో..

ఆదర్శ కమిటీలకు పాఠశాలల బాధ్యత

- మహిళా సంఘాల సభ్యులతో కమిటీల ఏర్పాటు
- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిర్ణయం
- ఉమ్మడి జిల్లాకు రూ.47.69 కోట్లు మంజూరు



మహిళా సంఘాల సభ్యుల సమావేశం(ఫైల్)

చుంచుపల్లి: కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ రంగ విద్యాసంస్థల బలోపేతంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను తాజాగా విడుదల చేయగా, ఉభయ జిల్లాల కలెక్టర్లు ఆర్‌డీఏ, విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అమ్మ ఆదర్శ కమిటీల నిర్వహణ బాధ్యతలు, పాఠశాలలకు నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. దీంతో జిల్లా అధికారులు మహిళా సంఘాల సభ్యులతో ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా గతంలో ఉన్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల స్థానంలో కొత్త ప్రభుత్వం ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తోంది.

పాఠశాలలు తెరిచేలోగా..

అధికారులు గుర్తించిన పాఠశాలల్లో అత్యవసరమైన పనులను వచ్చే జూన్ 10 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో యూడైస్ కింద గుర్తించిన 1,302 ప్రభుత్వ పాఠశాలలను పరిగణనలోకి తీసుకోనుండగా, ఖమ్మం జిల్లాలో 665 పాఠశాలలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 637 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఖమ్మంలో 578 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 87 హైస్కూళ్లు, భద్రాద్రి జిల్లాలో 653 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 44 హైస్కూళ్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి సంబంధించి డీఆర్‌డీఏ, విద్యాశాఖ అధికారులు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

ఖమ్మానికి రూ.25 కోట్ల కేటాయింపు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.47.69 కోట్లను మంజూరు చేసింది. ఇందులో భద్రాద్రి జిల్లాకు రూ. 22.89 కోట్లు, ఖమ్మం జిల్లాకు రూ.25 కోట్లను కేటాయించారు. ఇటీవల నియోజకవర్గాల అభివృద్ధికి మంజూరు చేసిన రూ.10 కోట్ల నిధుల్లోంచి కూడా రూ.2 కోట్లను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కొత్త బ్యాంకు ఖాతాలను తెరుస్తున్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో అత్యవసరమైన పనులను గుర్తించి అంచనాలు రూపొందిస్తున్నారు. కాగా ఈ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లాల వారీగా మహిళా సంఘాలు, పాఠశాలల వివరాలు

	భద్రాద్రి	ఖమ్మం
ప్రాథమిక పాఠశాలలు	766	813
ప్రాథమికోన్నత పాఠశాలలు	163	191
ఉన్నత పాఠశాలలు	109	202
గ్రామ సమాఖ్యలు	981	1,018
మొత్తం ఎస్‌హెచ్‌జీలు	18,197	25,051
మహిళా సభ్యులు	1,79,580	2,62,621

కమిటీ నిర్మాణం

గ్రామ/పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లుల్లో ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. వారు స్థానిక మహిళా సంఘాల్లో సభ్యులై ఉండటంతోపాటు ఒకరు ఎస్సీ /ఎస్టీలై ఉండాలి.

నిధుల వినియోగం ఇలా..

పాఠశాలల నిర్వహణ పర్యవేక్షణ కోసం మూడు శాతం నిధులను సర్వీసు చార్జీల కింద కమిటీలకు కలెక్టర్ ద్వారా చెల్లిస్తారు. కమిటీ చైర్మన్, కన్వీనర్‌కు చెక్ పవర్ కల్పించడంతోపాటు వారి పేరుమీద ఉమ్మడిగా బ్యాంకు ఖాతా తెరవనున్నారు. ప్రభుత్వ పాఠశాల పరిధిలో చేపట్టే రూ.25 వేల వరకు అయ్యే పనులకు టెండర్ లేకుండానే ఖర్చు చేసే అవకాశముంది. అంతకంటే ఎక్కువ మొత్తంలో ఉంటే కమిటీల ద్వారా కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంటుంది. కాగా, రూ.లక్ష దాటిన పనులను కలెక్టర్ల పర్యవేక్షణలో పరిశీలించి, హెచ్‌ఎం ధృవీకరించాకే చెల్లింపులు చేస్తారు. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం కొత్తగా మహిళా సంఘాలకు అప్పగించడంతో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కారమవుతాయనే భావన వ్యక్తమవుతోంది.



పెనుబల్లి ప్రాథమికోన్నత పాఠశాల

ఇవీ బాధ్యతలు

ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, గదుల మరమ్మతులు, పారిశుద్ధ్యం, విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటి వాటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు నిర్వహిస్తాయి. ఇందుకోసం ఉపాధి హామీ పథకం ప్రత్యేక నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆస్పత్రుల్లో హైదరాబాద్ బృందం తనిఖీ

- రెండు దవాఖానాల సీజ్, ఐదింటికి నోటీసులు
- అనుమతి లేక, నిబంధనలు పాటించక పోవడమే కారణం



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారుల బృందం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పలు సంతాన సాఫల్య కేంద్రాలతో వివిధ ఆస్పత్రుల్లో హైదరాబాద్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు చెందిన బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. ఈసందర్భంగా సరైన పత్రాలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు ఆస్పత్రులను సీజ్ చేశారు. ఈమేరకు శ్రీఫెర్టిలిటీ సెంటర్, భారతి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లను సీజ్ చేసిన అధికారులు సోమవారం రాత్రి వెల్లడించారు. అలాగే, సరైన అనుమతులు లేకపోవడం, అర్హత కలిగిన వైద్యులను నియమించకపోవడం తదితర కారణాలతో ప్రవీణ, జోయా, లావణ్య, మాతృశ్రీ, బిలీఫ్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వాహనదారులు నిబంధనలను అతిక్రమించొద్దు



యజమానులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌బాబు

ఖమ్మం క్రైం: వాహనదారులు నిబందనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు హెచ్చరించారు. ఖమ్మంలో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాల నియంత్రణకు సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, 50 వాహనాలను గుర్తించి యజమానులకు జరిమానా విధించారు. అలాగే, సరైన రీతిలో నంబర్ ప్లేట్ లేని వారిని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు బాధ్యులను గుర్తించేలా ప్రతీ వాహనానికి సరైన రీతిలో నంబర్ ప్లేట్ బిగించుకోవాలని సూచించారు. ఇలాంటి వారిని నియంత్రించేందుకు క్రమం తప్పకుండా స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు రవి, వెంకన్న, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి మరణాన్ని దిగమింగుకుని..

ఎస్సెస్సీ పరీక్షకు హాజరైన విద్యార్థి

సత్తుపల్లిటౌన్: అనారోగ్యంతో తండ్రి మరణించగా, అంత్యక్రియలు నిర్వహించిన మరుసటి రోజే.. ఆ బాధను దిగమింగుకుని ఎస్సెస్సీ విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని అవని వెంచర్‌లో నివాసముంటున్న వై.ముత్యాలరావు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందగా ఆయన అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ముత్యాలరావు ఏకైక కుమారుడు, ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎస్సెస్సీ చదువుతున్న మౌళిరాజ్ తలకొరివి పెట్టాడు. అయితే, సోమవారం నుంచి పదో తరగతి వార్షిక ప్రారంభం కావడంతో బంధువులు, కుటుంబీకుల సూచన మేరకు ఆయన దుఃఖాన్ని భరిస్తూనే సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్‌లోని పరీక్షా కేంద్రానికి హాజరై తెలుగు పరీక్ష రాశాడు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, స్నేహితులు సైతం ఆయనకు మనోధైర్యాన్నిచ్చారు.

ఘనంగా ఎంపీ కుమారుడి రిసెప్షన్



వధూవరులతో ఎంపీ నామా, మాజీ మంత్రి పువ్వాడ తదితరులు

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కుమారుడు భవ్యతేజ–శేష మనోజ్ఞ జ్యోతి వివాహం ఇటీవల జరగగా, సోమవారం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఉచిత వైద్యం, సేవా కార్యక్రమాలు



వంటపాత్రలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన నిరుపేదలకు ఉచిత వైద్యం అందజేయడంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీంద్రావు తెలిపారు. ఖమ్మంలోని గాంధీ పార్కులో సోమవారం నిర్వహించిన సమావేశంలో చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన వంద మంది చేనేత కార్మికులకు వంట పాత్రలు అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సొసైటీ బాధ్యులు జిల్లా వెంకటేశ్వర్లు, గజేంద్రుల నాగేశ్వరావు, గోవర్దన్ రావు, జిల్లా లక్ష్మీనారాయణ, ములకా సురేష్, ఎం.డీ.గౌస్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సోమవారం చేపట్టిన తనిఖీల్లో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని అర కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సతీష్ కథనం ప్రకారం.. ఖమ్మంకు చెందిన దండా సంజయ్, గుంటి సతీష్, వల్లూరి సాయికృష్ణ కాల్వొడ్డు వంతెన వద్ద గంజాయితో తిరుగుతుండగా అదుపులో తీసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చిన వారు సొంతంగా ఉపయోగిస్తుండడమే కాక ఎక్కువ ధరకు ఇంకొందరికి అమ్ముతున్నట్లు గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్ దరఖాస్తుకు గడువు పెంపు

మణుగూరు టౌన్: సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల కుటుంబాలు, పునరావాస ప్రాంతాలే కాక పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుండగా, దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీజీఎం(పర్సనల్) ఎస్.రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన కాస్మోటాలజీ, డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్ తదితర 38 కోర్సుల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి అర్హత కలిగిన వారు ఈనెల 30వ తేదీలోగా www.scclmines.com/apprenticeship వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ప్రతులను మణుగూరు వీటీసీ కార్యాలయంలో అందజేయాలని డీజీఎం సూచించారు.

ఇద్దరిని హతమార్చిన మావోలు?

- ఇన్‌ఫార్మర్ల నెపంతో బీజాపూర్‌లో ఘటన!
- సరిహద్దు గ్రామాల్లో ఆరాతీస్తున్న పోలీసులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని మావోయిస్టులు హతమార్చినట్లు తెలుస్తోంది. చర్ల మండలం పూసుగుప్ప నుంచి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న బీజాపూర్ జిల్లా రాంపురం – బీమారంపాడు మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టులు రెండు రోజుల క్రితం ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు హత్య చేశారన్న ప్రచారంతో చర్ల నుంచి మీడియా బృందం వెళ్లగా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. అయితే, కొత్తపల్లి నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో దుర్వాసన వచ్చినా మృతదేహాల ఆచూకీ తెలియరాలేదు. కాగా, రాంపురం, బీమారంపాడు, కొత్తపల్లి తదితర గ్రామాల గిరిజనులు మాత్రం హత్య జరిగి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. ఇంకొందరు గిరిజనులు.. కలప స్మగ్లర్లు బీజాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతానికి వెళ్లిన సందర్భంలో మావోయిస్టులు వారిని ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్య చేసి ఉండొచ్చని చెబుతున్నారు. ట్రాక్టర్లతో స్మగ్లర్లు అటవీ ప్రాంతానికి వెళ్లగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న మావోయిస్టులు వారిని హతమార్చి ట్రాక్టర్లను తీసుకెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోలు ఇద్దరిని హతమార్చారనే ప్రచారంతో పోలీసులు సరిహద్దు గ్రామాలకు వచ్చివెళ్లే వారిని ఆరా తీస్తున్నారు.

రోడ్లను దిగ్బంధించిన మావోయిస్టులు

- భారీ వృక్షాలు నరికి రోడ్డుకు అడ్డంగా వేసిన వైనం
- కందకాలు తవ్వకం, బండరాళ్లతో పేర్చి రోడ్లు మూసివేత
- భయంగుప్పిట్లో సరిహద్దు ఆదివాసీ గ్రామాలు



బీమారంపాడు-రాంపురం గ్రామాల మధ్యలో అడ్డంగా నరికి పడవేసిన చెట్లు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అటవీ ప్రాంత గ్రామాల్లోని రోడ్లను దిగ్బంధనం చేశారు. చర్ల మండలం పూసుగుప్ప శివారు బీజాపూర్ జిల్లాలోని రాంపురం, బీమారంపాడు, కొత్తపల్లి గ్రామాల మధ్యలో సుమారు 8 కిలోమీటర్ల పొడవునా ఉన్న అటవీ మార్గంలోని రహదార్లను మావోయిస్టులు దిగ్బంధించారు. భారీ వృక్షాలను నరికి రోడ్డుకు అడ్డంగా వేయడంతోపాటు రహదార్ల మధ్యలో భారీగా కందకాలను తవ్వారు. రాకపోకలు జరగకుండా పలు చోట్ల బండరాళ్లను రహదార్లకు అడ్డంగా పేర్చారు. మావోయిస్టులు ఈ ఘటనలను ఎందుకు పాల్పడ్డారనేది తెలియడంలేదని సరిహద్దు అటవీ ప్రాంతాల గ్రామాల గిరిజనులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలకు పాల్పడిన ప్రాంతాలకు సమీపంలో పూసుగుప్ప వద్ద పోలీసు క్యాంపు ఉండగా, ఇదే క్యాంపునకు సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని బీమారంపాడు వద్ద మరో పోలీసు క్యాంపును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. క్యాంపుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామనే సంకేతాలను తెలియజేసేందుకే ఈ తరహా ఘటనలకు పాల్పడి ఉండవచ్చుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లను దిగ్బంధించడంవల్ల ఆయా గ్రామాల ఆదివాసీల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆదివాసీలు తీవ్రంగా భయాందోళనలు చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

ఏన్కూరు: పొలానికి వెళ్లి వస్తున్న వ్యక్తి వాహనం అదుపు తప్పడంతో మృతి చెందిన ఘటన ఏన్కూరు మండలం కేసుపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శెట్టిపల్లి సురేష్(40) రాత్రి గ్రామ సమీపంలోని పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి కల్వర్టులో పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు. కాగా, ఏన్కూరు, తల్లాడ, జూలూరుపాడు ప్రాంతాలకు పరిచయస్తుడైన సురేష్ మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి



సుమంత్ (ఫైల్)

కల్లూరు: హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న అన్నదమ్ములు స్వస్థలమైన కల్లూరు వస్తుండగా అన్నకు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. కల్లూరుకు చెందిన నీలం రమేష్ – రమ్య దంపతులకు దంపతుల కుమారులిద్దరు హైదరాబాద్‌లో బీటెక్ చదువుకుంటున్నారు. వీరిద్దరూ కల్లూరు వచ్చేందుకు ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకోగా అన్న లం సుమంతనాయుడు(20) కళ్లు తిరిగి కింద పడడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు తెలుస్తుండగా, పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కల్లూరు తీసుకొచ్చారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని అనంతసాగర్ సమీపాన ఖమ్మం–విజయవాడ మార్గంలో మల్లెల కుటుంబరావు(30) సోమవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంకు చెందిన ఆయన గత కొంతకాలంగా తన అత్తగారి గ్రామమైన అనంతసాగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఓ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనలో కుటుంబరావు మృతదేహం ఛిద్రం కాగా, అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు బృందం పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు.

డీసీఎంను వెనక నుంచి ఢీకొట్టిన బైక్

ఒక యువకుడు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

కల్లూరు: కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మండలంలోని చంద్రుపట్లకు చెందిన కోటమర్తి అప్పారావు – కల్పన కుమారుడు కాశీ(22), ఇనుపనూరి రవితేజ, ఇనుపనూరి చరణ్ తిరువూరు వైపు నుంచి కల్లూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈనేపథ్యాన ఎన్నెస్పీ క్రాస్‌లో ఖమ్మం వైపు వెళ్తున్న అశోక్‌లేలాండ్ మినీట్రాన్స్‌పోర్టు వాహనం ఆగి ఉండగా, వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన కాశీ అక్కడికక్కడే మృతి చెందగా, రవితేజ, చరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఘటనాస్థలిని ఎస్‌ఐ షాకీర్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో పశువు మృతి

తిరుమలాయపాలెం: రఘునాథపాలెంలో సవారి లచ్చమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో వదిలిన దున్నపోతు విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమవారం గ్రామంలోని విద్యుత్ స్తంభం వద్ద మేస్తుండగా తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో గ్రామస్తులు పూజలు చేసి ఊరేగింపుగా వెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు.